

నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

## సోనియమ్మ జన్మదినం.. సమగ్ర శిక్షకి శిక్ష దినం

ఎదులాపురం, డిసెంబర్ 9 : సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్ అన్నారు. కలెక్టరేట్ ఎదుట నాలుగో రోజు కొనసాగుతున్న దీక్షలో భాగంగా సోమవారం దీక్షా శిబిరం నుంచి ఎన్టీఆర్ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ సోనియా గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ నిరసన తెలిపారు. సోనియమ్మకు జన్మదినం - సమగ్ర శిక్షకి- శిక్ష దినం అంటూ వినూత్న నిరసన చేపట్టారు. హామీ మేరకు రెగ్యూలర్ చేయాలని, తక్షణమే పే స్కేల్ అమలు చేయాలని, ఉద్యోగ, జీవన, జీవిత, ఆరోగ్య, ఆర్థిక భద్రత కల్పించాలని, సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం, మంత్రులు, తమ గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పీజీసీఆర్టీ కేజీబీవీ నాయకులు మమత మాట్లాడుతూ.. సీఎం మాట నిలబెట్టుకోవాలని లేని పక్షంలో ఈనెల 10 నుంచి కేజీబీవీ, యూఆర్‌ఎస్‌ల్లో విద్యార్థులకు బోధన నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అప్పటికి లోగా అసెంబ్లీలో ప్రకటన చేయకపోతే సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ ఎస్‌యూఎస్ జిల్లా నాయకులు ఆర్.కేశవ్ ప్రకాశ్, సారథి, వెంకటి, శ్రీకాంత్, సురేందర్, రాజన్న, భోజన్న, సురేశ్, దశరథ్, సంజీవ్, మమత, హిమబిందు, జ్యోతి, సందీప్‌రెడ్డి, సలీం, చిరంజీవి, రమేశ్ పాల్గొన్నారు.



తొమ్మిది డిమాండ్లను తీర్మానం చేసి నినాదాలు చేస్తున్న ఆదివాసీ పెద్దలు

# లంబాడాల ఎస్టీ హోదాను రద్దు చేయాలి

- ఏజెన్సీలోని మైనార్టీలను మైదాన ప్రాంతానికి తరలించాలి..
- ఆదివాసీ అస్తిత్వ పోరు గర్జన సభలో ఆదివాసీ పెద్దలు

ఇంద్రవెల్లి, డిసెంబర్ 9 : ఏజెన్సీలో అక్రమంగా వలస వచ్చి చట్టబద్ధత లేని లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని, ఏజెన్సీలో మైనార్టీలను మైదాన ప్రాంతాలకు తరలించాలని, లేని యెడల ఏప్రిల్ 10 నుంచి అమరవీరుల స్ఫూర్తితో మరో పోరాటం చేసేందుకు ఆదివాసులు సిద్ధమవుతారని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర కో-కన్వీనర్ మైపతి అరుణ్‌కుమార్, గోండ్వాన పంచాయతీ రాయిసెంటర్ జిల్లా సార్‌మేడి మెస్రం దుర్గు పేర్కొన్నారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని అమరవీరుల స్తూపం వద్ద ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ, గోండ్వాన పంచాయతీ రాయిసెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆదివాసీ హక్కుల ఉద్యమ దినోత్సవం, ఆదివాసీ అస్తిత్వ పోరు గర్జన సభ వేదిక ఆదివాసీల సమన్వయ కర్త సిడాం భీంరావ్ అధ్యక్షతన నిర్వహించారు. సభను ప్రారంభించుకుని తొమ్మిది డిమాండ్లతో కూడిన తీర్మానాన్ని ఆదివాసీ పెద్దల సమక్షంలో ప్రవేశ పెట్టారు. ఈ కార్యక్రమంలో గిరిజన పెద్దలు పాల్గొన్నారు.



ఆదివాసీ అస్తిత్వ పోరు గర్జన సభలో పాల్గొన్న ఆదివాసులు

# సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె బాట

**సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి**

- రెగ్యూలరైజ్ చేసి తక్షణమే పే-స్కేల్ అమలు చేయాలి
- ప్రభుత్వం స్పందించని పక్షంలో రేపటి నుంచి సమ్మె
- అవసరమైతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరిక

మంచిర్యాల, డిసెంబర్ 9(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'విద్యా శాఖ-సమగ్ర శిక్ష'లో కాంట్రాక్ట్ పద్ధతిన విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను రెగ్యూలరైజ్ చేయాలనే డిమాండ్‌తో నేటి(మంగళవారం) నుంచి ఉద్యోగులు సమ్మె బాట పట్టనున్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెగ్యూలరైజ్ చేసి, వెంటనే పే-స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గడిచిన నాలుగు రోజులు రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు కలెక్టరేట్ కార్యాలయాల ఎదుట రిలే దీక్షలు చేస్తున్నారు. సమస్యల పరిష్కారానికి పక్షం రోజుల ముందే కార్యాచరణ ప్రకటించి, ఈ నెల 10వ తేదీన సమ్మెకు వెళ్తామని చెప్పినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఉద్యోగులు వాపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మీ అందరినీ రెగ్యూలర్ చేస్తామని, గతేడాది నవంబర్ 18వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యోగులకు హామీ ఇచ్చారు. కానీ.. ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్న ఇచ్చిన హామీని అమలు చేయకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యామంటున్నారు. మేం కడుపు మండి నిరసన తెలుపుతుంటే.. మరోపక్క విజయోత్సవాలంటూ అధికారులు ఎవరూ తమను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వానికి ఇచ్చిన గడువు పూర్తయినందున నేటి నుంచి సమ్మె చేస్తామని, అప్పటికీ సీఎం రేవంత్‌రెడ్డి స్పందించకుంటే ఆమరణ నిరాహార దీక్షకు వెనకాడబోమని స్పష్టం చేస్తున్నారు.

### స్తంభించనున్న విద్యా వ్యవస్థ

విద్యాశాఖలో సమగ్ర శిక్ష ఉద్యోగులు వివిధ స్థాయిల్లో పని చేస్తున్నారు. జిల్లా స్థాయిలో ఏపీవోలు, సిస్టమ్ అనలటిక్‌లు, టెక్నికల్ పర్సన్, మండల స్థాయిలో ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు.. స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో సీఆర్‌పీలు, పాఠశాల స్థాయిలో పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్చర్స్, కేజీబీవీలు, యూఆర్‌ఎస్ పాఠశాలల్లో స్పెషల్ ఆఫీసర్లు, పీజీసీ ఆర్టీలు, వంట మనుషులు, వాచ్ ఉమెన్స్, స్వీపర్స్.. ఇలా అన్ని విభాగాల్లో ఈ ఉద్యోగులు ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 19,600 మంది సమగ్ర శిక్ష ఉద్యోగులు ఉండగా.. మంచిర్యాల జిల్లాలో 575, నిర్మల్‌లో 659, ఆసిఫాబాద్‌లో 496, ఆదిలాబాద్ 657 మంది పని చేస్తున్నారు. వీరంతా నేటి నుంచి సమ్మె చేస్తే విద్యా వ్యవస్థ స్తంభించిపోవడం ఖాయంగా కనిపిస్తున్నది. నాన్ టీచింగ్ ఉద్యోగులు అందరూ సమ్మెలో పాల్గొననుండడంతో వసతి గృహాల్లో విద్యార్థులకు ఇబ్బందులు తప్పేలా లేవు. ఇప్పటికే వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థినులకు ఈ సమ్మె శాపంగా మారనుంది. అన్నింటి కంటే ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేస్తున్న నేపథ్యంలో ఉద్యోగుల సమ్మెతో విద్యార్థుల తుది ఫలితాల పైనా ప్రభావం చూపించే అవకాశాలు ఉన్నాయి.



మంచిర్యాల కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షలో సమగ్ర శిక్ష ఉద్యోగులు

### ఉద్యోగుల డిమాండ్‌లు..

- దాదాపు గడిచిన ఇరవై ఏండ్లుగా పాఠశాల విద్య, అభివృద్ధి కోసం పని చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యూలర్ చేయాలి. అప్పటి వరకు పే-స్కేల్ ఇవ్వాలి.
- ప్రతి ఉద్యోగికి జీవిత బీమా రూ.10 లక్షలు, ఆరోగ్య బీమా రూ.10 లక్షల సౌకర్యం కల్పించాలి.
- ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు పదవీ విరమణ చేస్తున్న వారికి, చేసిన వారికి బెనిఫిట్స్ కింద రూ.25 లక్షలు ఇవ్వాలి.
- ప్రభుత్వ, విద్యాశాఖ నియామకాల్లో వెయిటేజ్ కల్పించాలి.
- పీటీఐలకు 12 నెలల వేతనం ఇవ్వాలి.
- సమగ్ర శిక్ష ఉద్యోగులకు రీ-ఎంగేజ్ విధానాన్ని తొలిగించాలి.

### సీఎం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి..



గతంలో రెగ్యూలరైజ్ కోసం సమ్మె చేసిన సందర్భంగా ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వెంటనే చేస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటారని ఏడాది కాలంగా ఎదురు చూశాం. నాలుగు రోజులు రిలే దీక్షలు చేస్తున్నా ఎలాంటి స్పందన లేదు. అందుకని ముందు ప్రకటించిన కార్యాచరణను అనుసరించి నేటి నుంచి సమ్మెకు పోతున్నాం. మా న్యాయమైన సమస్యలను పరిష్కారం అయ్యేందుకు ఎంత దూరమైన పోతాం. అవసరమైతే ఆమరణ నిరాహార దీక్ష చేపడుతాం.

*- రాజన్న, తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం, మంచిర్యాల జిల్లా సెక్రెటరీ.*



రిలే దీక్షలో సమగ్ర శిక్ష ఉద్యోగులు

### నోటీసులిచ్చినా పట్టింపు లేదు



సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వస్తే సచివాలయానికి పిలిచి చర్చించి మీ సమస్యలు పరిష్కరిస్తాం అన్నారు. చాయ్ తాగినంత సేపు పట్టదు మీ సమస్య పరిష్కారానికి అని చెప్పారు. కానీ.. యేడాదిగా ఎలాంటి డిమాండ్లు నెరవేర్చలేదు. కొన్ని రోజులుగా మేం పోరాటాలు చేస్తున్నాం. అసెంబ్లీ ముట్టడి చేశాం. జిల్లాల్లో ర్యాలీలు చేశాం. ఇందిరా పార్క్ ఎదుట ధర్నా చేశాం. శాంతియుత పోరాటం చేస్తున్నా ఫలితం లేకపోవడంతో సమ్మె నోటీసులు ఇచ్చాం. సమ్మెకు ముందు నాలుగు రోజులు రిలే దీక్షలు చేపట్టాం. కానీ.. ప్రభుత్వం నుంచి స్పందన లేదు. సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యూలరైజ్ చేయాలి. అప్పటి వరకు పే-స్కేల్ అమలు చేయాలి. అప్పటి దాకా ఉద్యోగులందరం సమ్మెలోనే ఉంటాం.

*- ఎ.సుమలత, తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు.*

## కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 9 : ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ సీపీఐ(ఎం) నాయకులు సోమవారం నిర్మల్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రైతులందరికీ రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలన్నారు. రైతు భరోసా పథకం ద్వారా వర్షాకాలం, యాసంగి పంటలకు సంబంధించి ఎకరానికి 15000 రూపాయలు ఇవ్వాలని కోరారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో దోపిడీ జరుగుతుందన్నారు. 40 కేజీల సంచికి 42 నుంచి 43 కిలోల వరకు తూకం చేసి దోపిడీ చేస్తున్నారన్నారు. అంతకుముందు అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం నూతన్‌కుమార్, బొమ్మెన సురేశ్, జిల్లా కమిటీ సభ్యులు నాగెల్లి నరసయ్య, తొడసం శంభు, నాయకులు రాపల్లి రాజేశ్ యాదవ్, రైతులు పాల్గొన్నారు.





కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

## మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టు

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి తరలివెళ్తున్న మాజీ సర్పంచ్‌లు, బీఆర్‌ఎస్ నాయకులను సోమవారం పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తెల్లవారు జాము నుంచే నాయకుల ఇండ్లకు వెళ్లి అరెస్టు చేశారు. ఖానాపూర్, నర్సాపూర్, పెంబి, దస్తురాబాద్‌లలో అరెస్టుల పర్వం కొనసాగింది.-నెట్‌వర్క్



దస్తురాబాద్ : మాజీ సర్పంచ్‌లు, బీఆర్‌ఎస్ నాయకులను అరెస్ట్ చేసిన పోలీసులు



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

### వసతి గృహాల్లోని సమస్యలను పరిష్కరించాలి..

గురుకుల వసతి గృహాల్లో నెలకున్న సమస్యలను పరిష్కరించాలని నిర్మల్ బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గురుకుల వసతి గృహాల్లో కనీస వసతులు కరువయ్యాయని, పిల్లలకు అందించే ఆహారం కలుషితమవుతుందన్నారు. ఇటీవల ఒక విద్యార్థి మృతి చెందాడన్నారు. వసతి గృహంలో విద్యుత్, తాగునీరు వసతులు లేవన్నారు. విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. వసతి గృహాల్లోని సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నయీంఖాన్, రిజ్వాన్‌ఖాన్, షేక్ మహబూబ్, అబ్దుల్ అజీజ్, ఖలీల్, రహమాన్, ఫహీం పాల్గొన్నారు.

# సారూ.. రుణం మాఫీ చేయండి

- ప్రజావాణికి పోటెత్తిన రైతులు
- అధికారులకు వినతిపత్రాలు అందజేత
- అధికార యంత్రాంగాన్ని వేడుకుంటున్న అన్నదాతలు

ఆదిలాబాద్(నమస్తే తెలంగాణ)/నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 9 : ఆరు గ్యారెంటీల్లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం మాఫీ చేస్తామన్న రూ.2 లక్షలు నామమాత్రంగా మారిందనడానికి ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో నిర్వహించిన ప్రజావాణికి పోటెత్తిన రైతులే నిదర్శనం. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల కలెక్టర్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి రైతులు భారీగా తరలివచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన నాలుగో విడుతలో తమ బ్యాంక్ రుణం రద్దు కాలేదని, అన్ని విధాలుగా అర్హులుగా ఉన్న తమను ప్రభుత్వం గుర్తించి రుణమాఫీ వర్తించేలా చర్యలు తీసుకోవాలంటూ వినతి పత్రాలు అందజేశారు. ఆదిలాబాద్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, నిర్మల్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్‌లు ఫిర్యాదులను స్వీకరించారు.

### అర్హులకు మొండిచేయి

రూ. 2 లక్షల రుణమాఫీకి అర్హులైన రైతులకు ప్రభుత్వం మొండిచేయి చూపింది. జిల్లాలో నాలుగు విడుతల్లో రూ. 2 లక్షల లోపు బ్యాంకు రుణం ఉన్న 62,298 మంది రైతులకు రుణమాఫీ జరిగినట్లు అధికారుల నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. రుణమాఫీకి సంబంధించిన రైతుల ఆందోళనల నేపథ్యంలో ప్రభుత్వం ఇంటింటా సర్వే నిర్వహించింది. వ్యవసాయ శాఖ సిబ్బంది గ్రామాల్లో పర్యటించి రైతుల వద్ద వివరాలు సేకరించి సెల్ఫీ ఫొటోతో యాప్‌లో అప్‌లోడ్ చేశారు. సర్వేలో భాగంగా వ్యవసాయ శాఖ అధికారులు 18 వేల మందిని కుటుంబ నిర్ధారణ చేశారు. దీంతోపాటు 3,400 మంది తమకు రుణమాఫీ కాలేదని రైతు వేదికల్లో దరఖాస్తులు అందజేశారు. తమకు రుణమాఫీ చేయాలంటూ రైతులు అధికారులు, బ్యాంకర్ల చుట్టూ తిరుగుతున్నా ఫలితం ఉండడం లేదు. ప్రభుత్వం రైతుల వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరించి, సర్వేలు నిర్వహించినా అర్హులకు రుణమాఫీ వర్తించలేదు.



రుణమాఫీ వర్తింప చేయాలని ప్రజావాణికి వచ్చిన ఉట్నూర్ మండలం శ్యాంపూర్ రైతులు



నిర్మల్ కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన రైతులు

### రూ.2 లక్షల రుణమాఫీ కాలేదు..

ప్రభుత్వం రూ.2 లక్షల రుణం ఉన్న రైతులకు మాఫీ చేస్తామని చెప్పి చేయలేదని భైంసా మండలంలోని వాలేగాం గ్రామానికి చెందిన రైతులు సోమవారం నిర్మల్ కలెక్టర్ కార్యాలయానికి వచ్చారు. ప్రభుత్వం ఎన్నికల ముందు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ప్రకటించిందని, ఇటీవల మాఫీ చేసిన జాబితాలో తమకు మాఫీ కాలేదని గ్రామానికి చెందిన రైతులు కార్యాలయానికి వచ్చి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నపుడు రుణమాఫీ అయిందన్నారు. కానీ.. రూ.2 లక్షల పైన ఉన్న రుణం ఉన్న రైతులకు మాఫీ కాలేదన్నారు. గ్రామంలో 150 మందికి మాఫీ కాలేదన్నారు. ప్రభుత్వం స్పందించి రుణమాఫీ చేయాలని రైతులు కోరారు.



ఫిర్యాదు చేసేందుకు వచ్చిన కాలనీవాసులు

### మురుగు నీరు రోడ్డు మీదకు వస్తున్నది..

నిర్మల్ పట్టణంలోని 12 వార్డులో మురుగునీరు రోడ్డు మీదకు వస్తున్నదని, మురుగు కాలువ లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని కాలనీవాసులు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ముందున్న ప్లాట్ల వారు అడ్డుగా మట్టిపోయడంతో మురుగునీరు ఇంటి ముందుకొస్తుందని కాలనీ వాసులు పేర్కొన్నారు. మురుగునీరు నిలిచి దోమలు వ్యాప్తి చెంది, జ్వరాలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

### రేవంత్ మాట నిలబెట్టుకోవాలి..



నాకు మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. నేను గిమ్మ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో రూ.1.80 లక్షల పంట రుణం బాకీ ఉన్నా. నాకు రేషన్‌కార్డు ఉంది. మూడో విడుతలో నాకు రుణమాఫీ జరగలేదు. నాలుగో విడుతలో బ్యాంక్ రుణం మాఫీ అవుతుందని ఆశతో ఎదురుచూశా. ఈసారి మాఫీ వర్తించలేదు. బ్యాంకు అధికారులు ప్రభుత్వానికి పంపిన లిస్ట్‌లో నా పేరు చూపెడుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు మాకు ఏమీ తెలియదని అంటున్నారు. ముఖ్యమంత్రి రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల బ్యాంకు రుణం మాఫీ చేయాలి.

*- దత్తు, రైతు, కేధార్‌పూర్, జైనథ్ మండలం*

### మా గ్రామంలో 80 మందికే మాఫీ అయ్యాయి



మా గ్రామానికి చెందిన రైతులు 250 మంది గిమ్మ మహారాష్ట్ర బ్యాంకులో పంట రుణం తీసుకున్నారు. నాలుగు విడుతల్లో కేవలం 80 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగింది. రూ.2 లక్షల లోపు ఉన్న మిగితా రైతులకు మాఫీ కాలేదు. బ్యాంకు రుణం మాఫీ చేయాలంటూ మూడు నెలల నుంచి అధికారులు, బ్యాంకర్ల చుట్టూ తిరిగినా ఫలితం లేదు. లిస్ట్‌లో మీ పేరు పంపామని బ్యాంకు అధికారులు అంటున్నారు. నాలుగో విడుతలో బ్యాంక్ లోన్ రద్దు కాకపోవడంతో ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చాం.

*- రాజ్‌కుమార్, కేధార్‌పూర్, జైనథ్ మండలం*

### ఎవరిని అడుగాలో తెలియడం లేదు..



నాకు శ్యాంపూర్ తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రూ.1.94 లక్షల పంట రుణం ఉంది. నా బ్యాంక్ లోన్ రద్దవుతుందని మూడో విడుతలో ఆశగా ఎదురుచూశా. రుణమాఫీ జరగకపోవడంతో వ్యవసాయ శాఖ అధికారులకు దరఖాస్తు చేసుకున్నా. బ్యాంకుకు వెళ్లి అధికారులను అడిగితే లిస్ట్‌లో నీ పేరు పంపాం అని అంటున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వం నుంచి రావాలంటున్నారు. దీంతో మా గ్రామానికి చెందిన 30 మంది రైతులం కలిసి ప్రజావాణిలో కలెక్టర్‌కు దరఖాస్తు ఇవ్వడానికి వచ్చాం.

*- అమిత్, రైతు, శ్యాంపూర్, ఉట్నూర్ మండలం*

### మూడు నెలల నుంచి తిరుగుతున్నాం..



మా గ్రామంలో చాలా మంది రైతులకు రుణం మాఫీ కాలేదు. నాకు ఉట్నూర్ తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రూ.1.60 లక్షల అప్పు ఉంది. మూడో విడుతలో నాతోపాటు మా గ్రామంలో చాలా మంది రైతులకు లోన్ మాఫీ కాలేదు. దీంతో మూడు నెలల నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నా. మా లాంటి పేద రైతులు ఎంతకని తిరగాలి. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలి. *- మెస్రం సురేశ్, గిరిజన రైతు, అలీగూడ, ఉట్నూర్ మండలం*